సాక్షి నల్లగొండ

బుధవారం ı 11 ı జనవరి ı 2023



పార్టీ బలపడితేనే..
కాంగ్రెస్ పార్టీ బలపడితేనే మనమంతా నాయకులమవుతామని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్ అన్నారు. - 8లో



సమస్యల వలయంలో..
ఉమ్మడి జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన పాలకీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. - 10లో



వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా లక్ష్మణ్


జస్టిస్ కె.లక్ష్మణ్

రామగిరి(నల్లగొండ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అడ్మినిస్ట్రేటివ్ జడ్జిల నియామకం మంగళవారం జరిగింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండ జిల్లాకు జస్టిస్ కె.లక్ష్మణ్, యాదాద్రి జిల్లాకు జస్టిస్ పి.మాధవిదేవి, సూర్యాపేట జిల్లాకు జస్టిస్ జి.రాధారాణి నియమితులయ్యారు. అడ్మినిస్ట్రేటివ్ జడ్జి హోదాలో జిల్లాలోని అన్ని కోర్టుల్లో న్యాయపరమైన అంశాలపై వీరికి అధికారాలు ఉంటాయి. కోర్టు ఉద్యోగుల నియామకాలు, అడ్మినిస్ట్రేషన్ అంశాలు వీరి పరిధిలో ఉంటాయి.

బీజేపీ లోక్‌సభ నియోజకవర్గాల ప్రభారీల నియామకం

- నల్లగొండకు ధర్మారావు, భువనగిరికి రామచంద్రారెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసేందుకు బీజేపీ కసరత్తు ముమ్మరం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా లోక్‌సభ స్థానాలకు ప్రభారీలు, కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లను నియమించింది. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పార్లమెంట్ ప్రభారీల జాబితాను ప్రకటించారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావును, భువనగిరికి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని నియమించారు. అలాగే నల్లగొండ లోక్‌సభ కన్వీనర్‌గా బండారు ప్రసాద్, భువనగిరి కన్వీనర్‌గా బండారు లింగస్వామి, జాయింట్ కన్వీనర్లుగా కొంతం శ్రీనివాస్, నారాయణ యాదవ్‌ను నియమించారు.

తూనికలు కొలతల అధికారుల తనిఖీలు



బియ్యం షాపులో తూకాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండల కేంద్రంలో తూనికలు కొలతల శాఖ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ వల్లపు శ్రీనివాసులు ఆధ్వర్యంలో కిరాణా, రైస్, ఎలక్ట్రికల్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. కిరాణా, రైస్ షాపులో తూకంలో తేడా ఉందని, ఎలక్ట్రికల్ షాపుల్లో ప్యాకేజీపై కంపెనీ చిరునామా, కస్టమర్ కేర్ వివరాలు లేకపోవడంతో మూడు షాపులపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. వినియోగదారులు బియ్యం కొనేటప్పుడు కంపెనీ ముద్రించిన బరువు సరి చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది వెంకటేశ్వర్లు, సైదులు తదితరులు ఉన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం

నార్కట్‌పల్లి : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటికి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తోందని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధించాలని, పెండింగ్ ప్రాజెక్టు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న హైదరాబాద్ ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో ఒక్క రోజు దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. టీఆర్‌ఎస్.. బీఆర్‌ఎస్‌గా మారినందున ఆంధ్రాలో కూడా బలమైన పార్టీగా ఎదగాలని భావిస్తోందని.. ఇప్పుడు బీఆర్‌ఎస్ మన కోసం కొట్లాడే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో యాదయ్య తదితరులు ఉన్నారు.

ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలిగా ప్రభావతి


పాలడుగు ప్రభావతి

రామగిరి(నల్లగొండ) : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కేంద్రం కమిటీ సభ్యురాలిగా పాలడుగు ప్రభావతి ఎన్నికయ్యారు. కేరళ రాష్ట్రం లోని తిరువనంతపురంలో ఈనెల 6 నుంచి 9 వరకు జరిగిన ఐద్వా జాతీయ 13వ మహాసభల్లో ఆమెను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. నిత్యం ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న తనను కేంద్ర కమిటీ సభ్యురాలిగా ఎంపిక చేసి మరింత బాధ్యత పెంచారని పేర్కొన్నారు.

12న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



నల్లగొండ టూటౌన్ : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని నిర్వహించే జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 12వ తేదీన నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15, 17, 19, 29 కేటగిరీల్లో బాల, బాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 12 ఉదయం 8 గంటలలోపు ఇండోర్ స్టేడియంలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 98663 17321 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

13న హాకీ జిల్లా జట్టు ఎంపిక



నల్లగొండ టూటౌన్ : ఈనెల 21 నుంచి 23 వరకు రంగారెడ్డి జిల్లా నందిగామలో జరిగే 7వ సబ్ జూనియర్ బాలుర రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొన్నడానికి జిల్లా జట్టు కోసం ఈనెల 13వ తేదీన నల్లగొండలోని ఔట్‌డోర్ స్టేడియంలో హాకీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కూతురు శ్రీనివాస్‌రెడ్డి, ఇమామ్ కరీం, కోశాధికారి బి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 01-01-2007 తర్వాత జన్మించి, హాకీ ఇండియా పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. 13న ఉదయం 10 గంటలలోపు స్టేడియంలో కోచ్‌లను సంప్రదించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 90301 07211 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


అద్దె వాహనాలకు దరఖాస్తులు



నల్లగొండ టౌన్ : ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 74 బృందాలకు అద్దె వాహనాలు సమకూర్చేందుకు ఈ నెల 11వ తేదీలోగా ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నెలకు రూ.23 వేలు అద్దె చెల్లించే ప్రాతిపదికన ఒప్పందం చేసుకుంటామని తెలిపారు. మంచి కండిషన్‌లో ఉన్న వాహనానికి సంబంధించిన ఆర్సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ ఇతర జి రాక్స్ పేపర్లతో సహా బుధవారం సాయంత్రం 5 గంటల వరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

తుదిదశకు మాస్టర్ ప్లాన్

- మరో పది రోజుల్లో కొలిక్కి వచ్చే అవకాశం
- నెలాఖరులోగా ప్రభుత్వానికి నివేదించనున్న అధికారులు
- రెండు నెలల్లో అమల్లోకి వచ్చే చాన్స్


నల్లగొండ పట్టణ వ్యూ

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపాలిటీ నూతన మాస్టర్ ప్లాన్‌పై వచ్చిన అభ్యంతరాల పరిశీలన పూర్తి కావస్తోంది. మాస్టర్ ప్లాన్‌పై మొత్తం 140 అభ్యంతరాలు వచ్చాయి. వీటిలో ఇప్పటి వరకు 120 అభ్యంతరాల పరిశీలన పూర్తి కాగా, మరో 20 అభ్యంతరాలను కూడా పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పది రోజుల్లోగా మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి కసరత్తు పూర్తిచేసే అవకాశం ఉంది. తుది మాస్టర్ ప్లాన్‌ను ఈ నెలాఖరులోగా రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి అక్కడ ఆమోదం తీసుకోనున్నారు. ప్రభుత్వ ఆమోదం పొంది కొత్త మాస్టర్ ప్లాన్ అమల్లోకి రావడానికి మరో రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని మాస్టర్ ప్లాన్‌ను కొలిక్కి తేవడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పరిశ్రమలకు ప్రత్యేక జోన్..

కొత్త మాస్టర్ ప్లాన్‌లో శేషమ్మగూడెం, కేశరాజుపల్లి, ఎఫ్‌సీఐ గోదాం సమీపంలో, చర్లపల్లి సమీపంలో, చర్లపల్లి నుంచి బుద్ధారం వెళ్లే రోడ్డు ప్రాంతాన్ని పరిశ్రమల జోన్ కింద పెట్టారు. దాంతో ఆయా ప్రాంతాల్లో పరిశ్రమలను పెట్టడానికి అనువుగా ఉంటుందని సంబంధిత అధికారులు ఒక అంచనాకు వచ్చారు. తుదిదశ మాస్టర్ ప్లాన్ వచ్చేసరికి కొన్ని మార్పులు, చేర్పులు అయ్యే అవకాశం లేకపోలేదు. ఆయా ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయనే ఉద్దేశంతో మాస్టర్ ప్లాన్‌లో ముందుగానే పరిశ్రమల జోన్‌ను గుర్తించారు. కాగా నీలగిరి మున్సిపాలిటీకి ప్రస్తుతం ఉన్న మాస్టర్ ప్లాన్ 1987 జూన్ 8వ తేదీన తయారు చేశారు. పెరుగుతున్న పట్టణానికి అనుగుణంగా ప్రతి 20 ఏళ్లకోసారి మాస్టర్ ప్లాన్ కొత్తగా తయారు చేయాల్సి ఉన్నా అమలుకు నోచుకోలేదు. మాస్టర్ ప్లాన్ గడువు పూర్తయి 16 సంవత్సరాలు పూర్తి కావస్తుంది. ఇప్పటికి పాత మాస్టర్ ప్లాన్ ప్రకారం నిర్మాణాలు జరుగుతున్నాయి.

నీలగిరి ఔటర్ రింగ్ రోడ్డు..

నీలగిరి పట్టణానికి పూర్వం నుంచే ఔటర్ రింగ్ రోడ్డు ఉంది. అతిపెద్ద రోడ్డు ఉన్నా దానిని అభివృద్ధి చేయకుండా వదిలేశారు. 50 ఏళ్ల కిందటనే పట్టణ పెరుగుదల, రవాణా, వాహనాల సంఖ్య, ట్రాఫిక్ తదితర వాటిని దృష్టిలో పెట్టుకొని పట్టణానికి ఔటర్ రింగ్ రోడ్డు తీశారు. కానీ మున్సిపల్, రెవెన్యూ అధికారులు దీని గురించి అంతగా పట్టించుకున్న దాఖలాలు లేకపోవడంతో ఔటర్ రింగ్ రోడ్డు ఆక్రమణలకు గురవుతుంది. పానగల్ ఛాయ సోమేశ్వరాలయం నుంచి ఎఫ్‌సీఐ గోదాం, కలెక్టర్ కార్యాలయం పక్క నుంచి, ముషంపల్లి రోడ్డు అన్నారం గుట్ట దగ్గరగా, సాగర్ రోడ్డులోని డాన్ బోస్కో స్కూల్ సమీపం నుంచి మునుగోడు రోడ్డు రాఘవేంద్ర కాలేజీ ప్రాంతం నుంచి మర్రిగూడ కాలుష్య నియంత్రణ కార్యాలయం సమీపం మీదుగా పానగల్ వరకు ఔటర్‌రింగ్ రోడ్డు ఉంది. ప్రస్తుతం నీలగిరి మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లను పరిశీలిస్తే కొత్త మాస్టర్ ప్లాన్‌లో ఇదే పెద్ద రోడ్డుగా ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

> **నెలాఖరులోగా ప్రభుత్వానికి నివేదిక**
>
> 
>
> కొత్తగా తయారు చేస్తున్న మాస్టర్ ప్లాన్ తుది దశకు చేరుకుంది. వారం, పది రోజుల్లో ఇక్కడ మాస్టర్ ప్లాన్ ప్రక్రియ పూర్తి చేసి ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి పంపుతాం. మరో రెండు నెలల్లో కొత్త మాస్టార్ ప్లాన్ అమల్లోకి రానుంది.
>
> – కె.వీ. రమణాచారి, మున్సిపల్ కమిషనర్

రాబోయే 20 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని..

రాబోవు రెండు దశాబ్దాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు కొత్త మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని కొత్త మాస్టర్ ప్లాన్ తయారు చేశారు. వ్యాపార వాణిజ్య ప్రాంతం, నివాస ప్రాంతం, వాణిజ్యం, నివాసం కలిపి ఉన్న ప్రాంతాలను వేరువేరుగా చూపించారు. పట్టణంలో కొన్ని నివాస ప్రాంతాల్లో ప్రస్తుతం వాణిజ్య దుకాణాల నిర్మించడంతో అటువంటి వాటిని పూర్తిగా వాణిజ్య ప్రాంతాలుగా గుర్తించారు. శివాజీనగర్ రోడ్, వీటీ రోడ్, పానగల్ రోడ్ ఫ్లైఓవర్ నుంచి ఉన్న దుకాణాలను నివాస ప్రాంతం నుంచి వాణిజ్య ప్రాంతంగా గుర్తించారు. అదే విధంగా పట్టణంలోని ప్రధాన రహదారులైన హైదరాబాద్ రోడ్, ప్రకాశం బజార్, నెహ్రూగంజ్, పానగల్ నుంచి కతాల్‌గూడ, ఎస్ఎల్‌బీసీ వరకు, భాస్కర్ టాకీస్ నుంచి హ్యాపీహోమ్స్ వరకు వాణిజ్య ప్రాంతాలుగా గుర్తించబడ్డాయి. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే 90 శాతం వరకు దుకాణాలు నిర్మించి వ్యాపారాలు నడుస్తుండడంతో వాణిజ్య పరంగా చూపించారు.

పండుగకైనా అందవా!

- 10వ తేదీ దాటినా అందని రేషన్ బియ్యం
- డిసెంబర్ వరకు ఐదు కేజీల ఉచిత బియ్యం ప్రకటించిన కేంద్రం
- పంపిణీపై నిర్ణయం తీసుకోని ప్రభుత్వం
- రేషన్ దుకాణాల వద్ద ఎదురుచూపుల్లో లబ్ధిదారులు


నల్లగొండలోని శాంతినగర్‌లో రేషన్ దుకాణం ఎదుట నిరీక్షిస్తున్న కార్డుదారులు

నల్లగొండ : జనవరి నెల ప్రారంభమై పది రోజులుగా గడిచినా రేషన్ కార్డుదారులకు బియ్యం అందలేదు. కేంద్రం ఉచిత బియ్యం ఈ సంవత్సరం డిసెంబర్ వరకు పొడిగించిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్ర ప్రభుత్వం దానికి ఐదు కేజీలు కలిపి 10 కేజీలు ఉచితంగా ఇస్తుందా.. లేక కేంద్రం ఇస్తున్న ఐదు కేజీలనే పంపిణీ చేస్తుందా.. అన్న విషయంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో 10 రోజుల నుంచి కార్డుదారులు రేషన్ షాపుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సంక్రాంతి పండుగ దగ్గరికొస్తున్న తరుణంలో రేషన్ అందుతుందా లేదా.. పండుగ పూట పస్తులుండాల్సిందేనా అని పేదలు ఆందోళన చెందుతున్నారు.

కేంద్రం ప్రకటించినా..

కరోనా ప్రారంభం నుంచి కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యం పంపిణీ చేపట్టింది. దానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా మరో ఐదు కేజీలు ఒక్కో యూనిట్‌కు పది కేజీల చొప్పున ఉచితంగా అందిస్తోంది. ఈ ఉచిత బియ్యం పంపిణీ 2022 డిసెంబర్‌తో ముగిసింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యం పంపిణీనికి 2023 డిసెంబర్ వరకు పొడిగించింది. ప్రతి ఒక్కరికి 5 కేజీల చొప్పున బియ్యం అందిస్తామని ప్రకటించింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ప్రకటించిన ఐదు కేజీల బియ్యాన్ని మాత్రమే పంపిణీ చేస్తుందా.. లేక దానికి గతంలో మాదిరిగా మరో ఐదు కేజీలు కలిపి 10 కేజీలు ఉచితంగా ఇస్తుందా.. అన్నదానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

> **టెక్నికల్ సమస్యతో జాప్యం**
>
> 
>
> ప్రతినెల 1వ తేదీ నుంచే బియ్యం పంపిణీ జరగాల్సి ఉంది. అయితే ఈ నెలలో బియ్యం పంపిణీ విషయంలో సాంకేతిక సమస్యలు ఉన్నాయి. బియ్యం పంపిణీని ఆపాలని చెప్పారు. ఆ సమస్య పరిష్కారమైతే పైఅధికారుల నుంచి వచ్చే ఆదేశాల మేరకు బియ్యం పంపిణీ చేస్తాం.
>
> – వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ

రేషన్‌షాపుల చుట్టూ ప్రదక్షిణలు..

ప్రతినెల 1వ తేదీ నుంచే రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం బియ్యం పంపిణీ చేపడుతుంది. ఈ నెల 10వ తేదీ దాటినా బియ్యం పంపిణీ చేపట్టకపోవడంతో కార్డుదారులు రేషన్ షాపుల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో రేషన్ డీలర్లు కార్డుదారులకు సమాధానం చెప్పలేక దుకాణాలను మూసే ఉంచుతున్నారు.

యాదాద్రిలో ఆంజనేయస్వామికి ఆకుపూజ



యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయానికి క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి మంగళవారం ఆచార్యులు ఆకుపూజను సంప్రదాయంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహాన్ని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. ప్రధానాలయంలో, విష్ణు పుష్కరిణి, అనుబంధ ఆలయాలైన శివాలయం, పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాల వద్ద ఉన్న ఆంజనేయ స్వామిని భక్తులు మొక్కుకొని, పూజలు చేశారు. ఇక ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి.

అయ్యో దేవుడా..!

- వేములవాడ వెళ్లొస్తుండగా కాల్వలో పడిన కారు
- బీబీనగర్, బొమ్మలరామారం వాసులు ఆరుగురు మృతి
- సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ వద్ద ఘోర ప్రమాదం
- అంతా క్షణాల్లోనే జరిగిపోయింది..
- రెండు కుటుంబాల్లో అంతులేని శోకం


కాల్వలో నుంచి కారును బయటికి తీయిస్తున్న పోలీసులు


ఘటనా స్థలంలో మృతదేహాలు

బీబీనగర్, బొమ్మలరామారం, జగదేవ్‌పూర్: ఏటా ఎములవాడ రాజన్న దర్శనం చేసుకొని వస్తున్నామనే సంతోషం.. వారిలో కొద్ది గంటలు కూడా నిలవలేదు. మూలమలుపు దాటేవరకు సజావుగానే సాగిన ప్రయాణానికి మృత్యువు కాపుగాసిందన్న విషయం తెలియకుండానే పైలోకాలకు వెళ్లిపోయారు. అతివేగం ఆరుగురి ప్రాణాలను బలిగొన్నది. రెండు కుటుంబాల్లో తీరని విషాదం మిగిల్చింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రానికి చెందిన బొల్లు సమ్మయ్య(38) స్టీల్ సామాన్లు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య స్రవంతి(36) కూడా చేదోడు వాదోడుగా ఉంటుంది. వీరికి కూతురు భవ్యశ్రీ(13), 7వ తరగతి కుమారుడు కార్తీక్ అలియాస్ లోకేష్(11) 5వ తరగతి అదే గ్రామంలోని మాంటిస్సోరి ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. సమ్మయ్య తన కుటుంబ సభ్యులతో పాటు బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామానికి చెందిన తన మామ బిట్టు వెంకటేష్(58), అత్త రాజమణి(56)లతో కలిసి సోమవారం తన కారులో వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్లారు. మంగళవారం తిరిగి వస్తుండగా జగదేవ్‌పూర్ మండల పరిధిలోని మునిగడప వద్ద వీరి కారు కాల్వలోకి బోల్తా కొట్టడంతో ఆరుగురు మృత్యువాత పడ్డారు.

మూలమలుపు దాటాక ప్రమాదం..

మునిగడప ప్రమాద ఘటన అతివేగం కారణంగా జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామంలోని ఎల్లమ్మగుడి వద్ద నిజానికి ప్రమాదకరమైన మూలమలుపు ఉన్నది. సహజంగా అక్కడ ప్రమాదాలు జరుగుతుంటాయి. కానీ... ఈ మలుపు దాటిన కొద్ది క్షణాలకే కారు అదుపు తప్పింది. డ్రైవింగ్ చేస్తున్న సమ్మయ్య అజాగ్రత్త వహించాడా... వేరే కారణాలున్నాయా... అనే దానిపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. కొండపోచమ్మసాగర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌పై నిర్మించిన కల్వర్టును ముందుగా ఎడమ వైపున ఢీకొట్టిన కారు అదుపుతప్పి మరింత వేగంతో కుడివైపునకు వెళ్లి అక్కడ మట్టిగడ్డను దాటి కెనాల్‌లో పడిపోయింది. ఈ క్రమంలో ముందుగా కెనాల్ పైభాగంలో ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను బలంగా తాకి కెనాల్ గుంతలోకి తలకిందులుగా పడిపోయింది. ఆలయాల సందర్శనకు వెళ్లివస్తున్నప్పుడు సహజంగా మధ్యలో ఆగి దావత్‌లు చేసుకోవడం పరిపాటి. అంతేగాకుండా దైవదర్శనం సందర్భంలో నిద్రకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వకపోవడం చూస్తుంటాం. తాజా ప్రమాదంలో ఈ రెండు కారణాలు కూడా ప్రభావం చూపాయా అనే కోణంలో కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇవే కాకుండా మృతులు ప్రయాణించిన కారు కండీషన్ సక్రమంగా లేకపోవడం, అందులో ఆరుగురు ఇరుకుగా కూర్చోవడం కూడా ప్రమాదానికి మరో కారణంగా భావిస్తున్నారు. ఈ సంఘటన జరిగిన వెంటనే పారిశుద్ధ్య కార్మికులు ముందుగా గమనించి హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. మృతదేహాలను వెలికి తీయడంలో కీలకంగా వ్యవహరించారు.

కలిసిరాని సెంటిమెంట్..

బీబీనగర్‌లోని దాసరి కుటుంబాలకు చెందిన వారంతా ప్రతి ఏడాది వారి ఆరాధ్య దైవమైన వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్లడం ఆనవాయితీ. రాజన్నను సోమవారం మాత్రమే దర్శించుకోవడం వీరికి సెంటిమెంట్. స్టీల్ సామాన్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం గడుపుతున్న సమ్మయ్య కుటుంబం ప్రతి ఏడాది మాదిరిగా ఈ సంవత్సరం కూడా సోమవారమే రాజన్న దర్శనానికి వెళ్లగా, అనుకోని ప్రమాదం చోటుచేసుకుని తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. ఈ విషయం వారి బంధువులకు తెలియడంతో బీబీనగర్‌లో, బొమ్మలరామారంలోని మాల్యాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇరుగుపొరుగు వారు వచ్చి మృతుల బంధువులను ఓదార్చారు.

> **కలత చెందిన ఉపాధ్యాయులు..**
>
> 
> భవ్యశ్రీ(ఫైల్)
>
> 
> లోకేష్(ఫైల్)
>
> 
> సమ్మయ్య, స్రవంతి (ఫైల్)
>
> ఈ ప్రమాదంలో మృతి చెందిన భవ్యశ్రీ, లోకేష్‌లు బీబీనగర్‌లోని మాంటిస్సోరీ ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి, 5వ తరగతి చదువుతున్నారు. వారిద్దరు మృతిచెందడంతోటి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను కలిచివేసింది. భవ్యశ్రీ మెరిట్ స్టూడెంట్ అని ఉపాధ్యాయులు చెప్పారు. కాగా, ఇద్దరు విద్యార్థుల మృతికి సంతాపంగా బుధవారం పాఠశాలకు సెలవు ప్రకటించారు.

> **పోలీస్‌స్టేషన్ నుంచి కాల్ రాగానే గుండె పగిలినట్టయ్యింది..**
>
> నిన్న(సోమవారం) మధ్యాహ్నం తర్వాత మా నాన్న, అమ్మలు బావ, అక్కతో పాటు వారి పిల్లలతో కలిసి వేములవాడ పోయింద్రు. మొక్కులు తీర్చుకొని ఇయ్యాల(మంగళవారం) 12గంటలకు బయలుదేరుతున్నమని నాకు ఫోన్ చేసి చెప్పింద్రు. సాయంత్రం 4గంటల తర్వాత జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. మీవాళ్లకు యాక్సిడెంట్ అయ్యిందని చెప్పడంతో ఒక్కటేసారి గుండె పగిలినట్టయ్యింది... అంటూ మృతుడు వెంకటేష్ కుమారుడు శ్రీకాంత్ రోదించాడు. విషమస్థితిలో ఉన్న తన తండ్రిని గజ్వేల్ ఆస్పత్రి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించే క్రమంలో విలేకరులతో మాట్లాడుతూ విలపించాడు. అయ్యో దేవుడా... ఎంత పనైంది... అంటూ గుండెలు బాదుకున్నాడు.
>
> 
> రోదిస్తున్న వెంకటేష్ కుమారుడు శ్రీకాంత్

> **వారిది నిరుపేద కుటుంబం..**
>
> 
> వెంకటేష్-రాజమణి (ఫైల్)
>
> ప్రమాదంలో మృతి చెందిన వెంకటేష్-రాజమణి దంపతులది పేద కుటుంబం. వీరు రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండే వారు. రాజమణి గాజులు, స్టీల్, ప్లాస్టిక్ సామాన్లు అమ్ముతుంటుంది. వెంకటేష్ గ్రామంలో ఎక్కడైన కూలి లభిస్తే వెళ్లేవాడు. లేని పక్షంలో బొమ్మలరామారం మండలంతో పాటు సమీపంలోని తుర్కపల్లి, మూడుచింతలపల్లి, షామీర్‌పేట్ మండలాల్లో భాగవతం పాటలు పాడుతూ భిక్షాటన చేసేవాడు. గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉండే ఈ దంపతులు అకస్మాత్తుగా ప్రమాదంలో మృతిచెందడంతో మాల్యాల గ్రామస్తులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. రాజమణి -వెంకటేష్ దంపతులకు స్రవంతి, విజయ కూతుళ్లు, కొడుకు శ్రీకాంత్ ఉన్నారు. విజయ కుటుంబం గోదావరిఖనిలో ఉంటోంది. కొడుకు శ్రీకాంత్ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. పెద్ద కూతురు స్రవంతి కుటుంబమంతా ఈ ప్రమాదంలో మృతి చెందింది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

చిట్యాల : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన చిట్యాల మండలంలో ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ఎన్.ధర్మా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి మండలం గోపాలయపల్లి గ్రామానికి చెందిన మునుకుంట్ల సురేష్(26) సోమవారం సాయంత్రం బైక్‌పై చౌటుప్పల్ వైపునకు బయలుదేరాడు. మార్గమధ్యలో చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ పరిధిలోకి వెళ్లగానే వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్ తలకు తీవ్ర గాయాలవడంతో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు


గాయపడిన శ్రీను

వలిగొండ : తాటిచెట్టు పైనుంచి కిందపడడంతో ఓ గీత కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఎం.తుర్కపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పలుసం శ్రీను రోజుమాదిరిగా కల్లు తీసేందుకు గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో గాయపడ్డాడు. స్థానికులు గమనించి అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. గాయపడిన శ్రీనుకు రూ.5లక్షల ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల అధ్యక్షుడు పబ్బతి మల్లేశం కోరారు.

వ్యక్తి అదృశ్యం


సురేష్

భువనగిరి : వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామ ంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన గడ్డం సురేష్ గత నెల డిసెంబర్ 31న తెల్లవారుజామున ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా బైకుపై వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భార్య సంధ్య ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

చేపల మృతిపై విచారణ జరిపించాలి

అడ్డగూడూరు : మండలంలోని బొడ్డుగూడెంలో గల రామన్నకుంట చెరువులో చేపలు మృత్యువాత పడుతున్న అంశంపై అధికారులు విచారణ జరిపించాలని చేపల పెంపకం దారుడు వెంపల్ల నర్సిరెడ్డి కోరాడు. మంగళవారం విలేకరుల మాట్లాడారు. రామన్నకుంట చెరువును పంచాయతీ నుంచి రూ.8వేలకు పాట పాడి పలు రకాల చేపలను పెంచుతున్నానని తెలిపాడు. కొద్ది రోజులుగా చేపలు మృత్యువాత పడుతున్నాయని వాపోయాడు. దీనిపై విచారణ జరిపి నష్టపరిహారం ఇప్పించాలని కోరాడు.

గంజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్ట్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

- రూ.5లక్షలు విలువైన 22 కేజీల సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేటక్రైం : గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురు వ్యక్తులను ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో సూర్యాపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి సుమారు రూ.5లక్షలు విలువ చేసే 22కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం తన కార్యాలయంలో సూర్యాపేట జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్ నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి కేసు వివరాలు వెల్లడించారు.

సులువుగా డబ్బు సంపాదించాలని..

హైదరాబాద్‌కు చెందిన ఠాకూర్ నిఖిల్ సింగ్, సారగండ్ల మహేష్, రోహన్ రాజ్‌పుత్, కాలు తివారి నలుగురు స్నేహితులు. వీరు జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించాలని అరకు పరిసర ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నారు. ఈ నెల 5న జూమ్‌లో క్యాబ్ బుక్ చేసుకొని 20కేజీల గంజాయి కొనుగోలు చేశారు. సరుకును హైదరాబాద్‌కు తరలించాల్సి ఉండగా పోలీసుల చెకింగ్‌లకు భయపడి నాలుగు రోజుల పాటు అరకులో లాడ్జి తీసుకొని ఉన్నారు. ఈ నెల 9న రోహన్ రాజ్‌పుత్, కాలు తివారీ బస్సులో హైదరాబాద్ వెళ్లిపోయారు.అయితే, గంజాయిని తీసుకొని ఠాకూర్ నిఖిల్ సింగ్, సారగండ్ల మహేష్ హుజూర్‌నగర్ మీదుగా బయలుదేరుతున్నారు. హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వీరు పోలీసులకు చిక్కారు. వీరి వద్ద నుంచి 20 కేజీల గంజాయి, టాటా పంచ్ కారు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

చదువు మధ్యలో మానేసి..

నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం బొల్లారం గ్రామానికి చెందిన పురం గణేష్ పారా మెడికల్ చదువు మధ్యలోనే ఆపేసి కూలి పనులు చేస్తూ గంజాయికి అలవాటు పడ్డాడు. దాచేపల్లికి వెళ్లి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద 800గ్రాముల గంజాయిని కొనుగోలు చేశాడు.అనంతరం సరుకుతో గరిడేపల్లిలో తిరుగుతుండగా పోలీసులు పట్టుకున్నారు. కేసులో చాకచక్యంగా పనిచేసిన పోలీస్ సిబ్బందికి ఎస్పీ రివార్డులను అందించారు. సమావేశంలో కోదాడ డీఎస్పీ వెంకటేశ్వర్లు, మునగాల, హుజూర్‌నగర్ సీఐలు ఆంజనేయులు, రామలింగారెడ్డి, ఎస్ఐలు ఏడుకొండలు, వెంకట్‌రెడ్డి, కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

వేతనాలు సరిపోవడం లేదని..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విజయ్‌కుమార్, బంగారు రాజు హైదరాబాద్‌లో హాస్టళ్లలో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నారు. స్నేహితులతో కలిసి గంజాయి తాగే అలవాటు ఉంది. వీరికి వచ్చిన జీతాలు సరిపోకపోవడంతో వైజాగ్ నుంచి మూడు నెలలకు ఒకసారి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకొంటూ జల్సాలు చేస్తున్నారు. ఈ క్రమంలో 1.50కేజీల గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్ వస్తుండగా నడిగూడెం వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో ‘జయ’ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన జయ పాఠశాల విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : నేషనల్ సైన్స్ ఒలింపియాడ్‌లో జిల్లా కేంద్రంలోని జయ పాఠశాల నుంచి 11మంది విద్యార్థులు పాల్గొని రెండో లెవల్‌కు అర్హత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్ తెలిపారు. 5వ తరగతి నుంచి ఎస్. రేవంత్, పి. అనన్యరెడ్డి, 6వ తరగతి నుంచి వి. జయసూర్య, 7వ తరగతి నుంచి డి. రిత్విక, బి. హర్షవర్ధన్, ఆర్. గణేష్‌రెడ్డి, ఆర్. విష్ణువర్ధన్, 8వ తరగతి నుంచి ఎం. అరుణ్‌రెడ్డి, వి. శ్వేతాన్, 9వ తరగతి నుంచి పవన్, ఆర్. సుజిత్ ఈ ఒలింపియాడ్‌లో పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం కరస్పాండెంట్‌తో పాటు పాఠశాల డైరెక్టర్లు జిల్లా పద్మ, బింగి జ్యోతి అభినందించారు.

మహిళ పట్ల అసభ్యప్రవర్తన.. మూడేళ్ల జైలుశిక్ష


బొడ్డుపల్లి కాదయ్య

రామన్నపేట: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు బెదిరించిన వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.రెండువేల జరిమానా విధిస్తూ రామన్నపేట జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్. చందన మంగళవారం తీర్పు చెప్పారు. కేసుకు సంబంధించిన వివరాలు ఎస్ఐ లక్ష్మయ్య వెల్లడించారు. మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన ఓ మహిళ 2015 జూన్ 12వ తేదీన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన బొడ్డుపల్లి కాదయ్య వెళ్లి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. చంపుతానని బెదిరించాడు. ఆమె అతని నుంచి తప్పించుకొని బయటకు రావడంతో అతడు అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలు అదేరోజున రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి తగిన ఆధారాలు సేకరించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఏపీపీ పి. వెంకటఅవినాష్ బాధితురాలి పక్షాన వాదనలు వినిపించారు. కేసు పూర్వాపరాలు, సాక్షులను విచారించిన మెజిస్ట్రేట్ నిందితుడికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా విధించారు. నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన సాక్షులను, ఎస్ఐ, ఏపీపీ, కోర్టు కానిస్టేబుల్‌ను రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ ఒక ప్రకటనలో అభినందించారు. నగదు రివార్డు ప్రకటించారు.

ఉరేసుకుని వార్డు సభ్యురాలి ఆత్మహత్య


శాంతి మృతదేహం

మఠంపల్లి: ఉరేసుకుని ఓ పంచాయతీ వార్డు సభ్యురాలు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని బాడవాతండా గ్రామపంచాయతీ పరిధిలోని మామిడిచెట్టుతండాలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోతుశాంతి (27) పంచాయతీ 7వ వార్డు సభ్యురాలిగా పనిచేస్తోంది. భర్త శ్రీరాములు కూలీగా పని చేస్తున్నాడు. కాగా, అనారోగ్య కారణాలతో శస్త్ర చికిత్స చేయించుకున్న బానోతు శాంతి ఇంటి వద్దేఉంటోంది. ఏం జరిగిందో తెలియదు కానీ సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించేలోపే మృతిచెందింది. మృతురాలి 10ఏళ్ల కుమారుడు సూర్యాపేటలో చదువుకుంటున్నాడు. కాగా, శాంతి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

దారికాచి.. కత్తితో దాడి చేసి..

- వ్యక్తి దారుణ హత్య.. అడ్డొచ్చిన హతుడి భార్యపైనా దాడి
- పాతకక్షలతోనే ఘాతుకం
- సూర్యాపేట జిల్లాలో ఘటన


నాగు మృతదేహం

ఆత్మకూర్-ఎస్ : పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యర్థి దారికాచి దంపతులపై దాడికి తెగబడ్డాడు. దారుణ ఘటనలో భర్త అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా భార్యకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఆత్మకూర్ (ఎస్) మండలం దబ్బతండాలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బతండాకు చెందిన జాటోత్ నాగు (43) వ్యవసాయంతో పాటు డోజర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నాగుకు అదే గ్రామానికి చెందిన జాటోత్ భరత్‌తో కొంతకాలంగా పాతకక్షలు ఉన్నాయి. కాగా, నాగు తన భార్య సుజాతో కలిసి శంకన్నగూడెం సమీపంలో ఉన్న వ్యవసాయ భూమికి మంగళవారం రాత్రి నీళ్లు మళ్లించి ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో తండాకు సమీపంలో ఉన్న ఎస్సారెస్పీ కాలువ సమీపంలో కల్వర్టు వద్ద అప్పటికే కాపు కాచి ఉన్న జాటోత్ భరత్ కత్తితో నాగుపై దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. అడ్డుగా వచ్చిన సుజాతపై కూడా దాడి చేసి నిందితుడు పరారయ్యాడు. తన కళ్ల ముందే భర్త ప్రాణాలు విడువడంతో సుజాత బోరుమంది. ఘటన స్థలాన్ని సీఐ సోమ్‌నారాయణసింగ్, ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి పరిశీలించారు. హతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చిరంజీవి భద్రతా కార్డు అందుకున్న రమేష్



భద్రతా కార్డు అందుకుంటున్న గుండెపంగు రమేష్

కోదాడఅర్బన్ : హైదరాబాద్‌లోని చిరంజీవి చారిటబుట్ ట్రస్ట్ నందు ఇప్పటి వరకు అత్యధిక సార్లు రక్తదానం చేసిన దాతలకు సోమవారం రాత్రి భద్రతా కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా కోదాడకు చెందిన చిరంజీవి యువత జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెపంగు రమేష్ కూడా చిరంజీవి భద్రతా కార్డును అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యధిక సార్లు రక్తదానం చేసిన దాతలకు సినీ హీరో చిరంజీవి రూ.7లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించారని తెలిపారు. ఇలా కార్డులు అందించడం ద్వారా మరికొంత మంది స్ఫూర్తి పొంది రక్తదానం చేయడానికి ముందుకొస్తారని అన్నారు.

దండు మైసమ్మ హుండీ ఆదాయం రూ. 3,09,896

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : మండల పరిధిలోని నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయ హుండీని గ్రామస్తుల సమక్షంలో మంగళవారం లెక్కించారు. 82 రోజులకు గాను హుండీ ఆదాయం రూ.3,09,896 సమకూరినట్లు ఆలయ ఈఓ కుశలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, నగేష్, బెల్లంకొండ సైదులు, శ్రీనివాస చారి, పూజారులు సతీష్ కుమార్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి


గుర్తుతెలియని యువకుడి మృతదేహం

కోదాడరూరల్ : వాహనం ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతిచెందిన ఘటన కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ ఫ్లెవైఓవర్ వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఫ్లెవైఓర్ బ్రిడ్జి వద్ద ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని సమాచారం రావడంతో అక్కడకు చేరుకుని మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. అయితే ప్రమాదం జరిగిన ప్రదేశంలో మరో వ్యక్తి స్కూటీ పైనుంచి కిందపడి ఉన్నాడని, అతడు విజయవాడలోని కళామందిర్‌లో పనిచేస్తానని అన్నాడని స్థానికులు తెలిపారు. చనిపోయిన వ్యక్తి, స్కూటీపై నుంచి పడిపోయిన వ్యక్తి కలిసి ఒకే బైక్‌పై వచ్చారా లేదా స్కూటీపై ఉన్న వ్యక్తే రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టాడా లేక మరో వాహనం ఢీకొడితే ఈ ప్రమాదం చోటు చేసుకుందా అనే వివరాలు పోలీసుల విచారణలో తేలనుంది.

కళ్లద్దాలొచ్చాయ్

- డీఎంహెచ్ఓ కార్యాలయానికి 43,900 కంటి అద్దాలు సరఫరా
- ఈనెల 18 నుంచి రెండో విడత కంటి వెలుగు
- సన్నాహాలు చేస్తున్న అధికారులు
- 4.90లక్షల మందికి పరీక్షలు



నాగారం: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 18 నుంచి గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన సామగ్రి, కళ్లద్దాలు అందుబాటులో ఉంచడంతో పాటు బృందాలను నియమించారు. దృష్టి లోపంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి రూపకల్పన చేసింది. జిల్లాలో 12లక్షల మంది జనాభా ఉండగా మొదటి విడతలో 40శాతం మందికి పరీక్షలు నిర్వహించారు.

ఒక్కో చోట రెండు నుంచి వారం రోజుల పాటు

రెండో విడతలో జిల్లాలో 4.90 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. 50 బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి 100 రోజుల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 33, పట్టణ ప్రాంతాల్లో 17 బృందాలు పనిచేయనున్నాయి. ఒక్కో బృందంలో ఒక వైద్యాధికారి, ఆప్టోమెట్రిస్ట్, డాటా ఎంట్రీ ఆపరేటర్, పర్యవేక్షులు, ఆయా గ్రామాల పరిధిలోని ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ఉంటారు. ఒక్కోచోట రెండు రోజుల నుంచి వారం రోజుల పాటు శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ముందస్తుగా సిబ్బంది ద్వారా కరపత్రాలను పంపిణీ చేసి శిబిరాలకు తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోనున్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్ర 4గంటల వరకు శిబిరాల్లో పరీక్షలు చేస్తారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరినీ పరీక్షించి కంటి సంబంధిత వ్యాధులు ఏమున్నాయో చూస్తారు. బీపీ, మధుమేహం కారణంగా కంటిలో మార్పులను పరిశీలిస్తారు. దృష్టి లోపం ఉన్న వారికి అక్కడే కళ్ల అద్దాలు పంపిణీ చేస్తారు. ప్రత్యేకమైన అద్దాలు అవసరమున్న వారికి (ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్) ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తారు. రెండు వారాల్లో సదరు వ్యక్తి ఇంటికి నేరుగా వాటిని చేర్చనున్నారు.

రెండో విడతలో..

మొత్తం జనాభా	12,00,000
పరీక్షలు చేయాల్సినవారి సంఖ్య	4.90 లక్షలు
నియమించిన బృందాలు	50
అవసరమైన అద్దాలు	87,000

అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేస్తాం



జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమానికి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. పరీక్షలు చేయడానికి బృందాలను ఏర్పాటు చేసి వారికి విధులపై అవగాహన కల్పించాం. జిల్లాలో 616 శిబిరాల ద్వారా 4.90 లక్షల మందికి పరీక్షించనున్నాం. అన్ని శాఖల అధికారుల, సిబ్బంది, ప్రజా ప్రతినిధులందరి భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం.

– డాక్టర్ హర్షవర్ధన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి, సూర్యాపేట.

ప్రస్తుతం ఐదు రకాల కంటి అద్దాలు

రెండో విడత కోసం కంటి అద్దాలు వచ్చాయి. జిల్లాకు 87,000 కంటి అద్దాలు రావాల్సి ఉంది. అయితే మొదటి విడతలో భాగంగా ఇప్పటి వరకు 43,900 కళ్ల అద్దాలను డీఎంహెచ్ఓ కార్యాలయానికి ప్రభుత్వం సరఫరా చేసింది. వీటిలో ఐదు రకాలు వచ్చాయి. అవి 1.00, 1.50, 2.00, 2.50, 3.00 రకం ఉన్నాయి. విడతల వారీగా అవసరమైన కళ్ల అద్దాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు.

నియామక పత్రం అందజేసిన ఆర్‌డీఓ


దివ్యాంగుడు సురేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఆర్‌డీఓ వెంకారెడ్డి

హుజూర్‌నగర్ : మంత్రి కేటీఆర్ హామీ ప్రకారం కలెక్టర్ ఆదేశాల మేరకు హుజూర్‌నగర్‌కు చెందిన దివ్యాంగుడు సరికొండ సురేష్‌కు అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ నియామక పత్రాన్ని ఆర్‌డీఓ వెంకారెడ్డి మంగళవారం అందజేశారు. ఇటీవల హుజూర్‌నగర్ వచ్చిన మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఆధ్వర్యంలో సురేష్ కుటుంబ సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రి ఆదేశాల మేరకు అతనికి మేళ్లచెరువు మండల వనరుల కేంద్రంలో అవుట్ సోర్సింగ్ విధానంలో ఒక ఏడాది పాటు ఎంఐఎస్ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ దామోదర్‌రావు ఉన్నారు.

పార్టీ బలపడితేనే నాయకులమవుతాం


సమావేశంలో మాట్లాడుతున్న చెరుకు సుధాకర్, పక్కన డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ తదితరులు

- ఐక్యంగా పనిచేసి కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి
- హాత్‌సే హాత్ జోడో సమావేశంలో చెరుకు సుధాకర్

నల్లగొండ : పార్టీ బలపడితేనే మనమంతా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఇతర ప్రజా ప్రతినిధుల కాగలుగుతామని, పార్టీకి నష్టం జరిగితే మనకూ నష్టం జరుగుతుందని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం నల్లగొండలోని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అధ్యక్షతన హాత్ సే హాత్ జోడో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చెరుకు సుధాకర్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ నాయకత్వంలో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నిర్వహిస్తున్న భారత జోడో యాత్రను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్ర ఈనెల 26న ముగుస్తున్నందున అదే రోజు జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జోడో యాత్ర ప్రత్యేకతను ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధిని గుర్తుచేస్తూ.. మోదీ, కేసీఆర్ పాలనలో వైఫల్యాలను కూడా తెలియజేయాలని కోరారు. పార్టీలో సమస్యలు సహజమని తొందర్లోనే మాజీ మంత్రి జానారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించుకుందామని చెప్పారు. పార్టీ ప్రధాన కార్యదర్శులు కుందూరు రఘువీర్‌రెడ్డి, కొండేటి మల్లయ్య, చలమల్ల కృష్ణారెడ్డి, పున్న కైలాస్‌నేత, వల్లి నారాయణరెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దుబ్బాక నర్సింహారెడ్డి, మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాల్వాయి స్రవంతి మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 2నెలల పాటు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి జోడో యాత్ర ఉద్దేశాన్ని ప్రజలకు తెలిజేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో నాయకులు అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆదిమల్ల శంకర్, పరమేష్, రాజారమేష్, ముదిరెడ్డి నర్సిరెడ్డి, కత్తుల కోటి, ముంతాజ్ అలి, బొంత వెంకన్న, కోట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మంగళవారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్య శాశ్వత కల్యాణాన్ని అత్యంత వైభవంగా అర్చకులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, పంచామృతాభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చలు, అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చలను గావించారు. ఎదుర్కొళ్ల మహోత్సవాన్ని రమ్యంగా రక్తికట్టించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేదమంత్రోచ్చరణలతో కల్యాణతంతు ముగించారు. శ్రీఆంజనేయస్వామికి తమలపాకుల పూజలు చేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, నవీన్, లక్ష్మణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీ అనుమతులు రద్దుచేయాలి


ఫార్మా కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న సర్పంచ్‌లు, ప్రజలు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామ శివారులో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు వెంటనే రద్దుచేయాలని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ కంపెనీ వద్దకు వెళ్లి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కిష్టాపురం, కోతులారం, ఇప్పర్తి గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ కంపెనీ నిర్మాణం కొనసాగిస్తే తమ గ్రామాల పరిసర ప్రాంతాలు కాలుష్యమయమైతాయని, జీవరాశులు బతికే అవకాశం లేకుండా పోతుందన్నారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని కంపెనీ అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నందిపాటి రాధరమేష్, బొజ్జ సుజాతశ్రీను, జాజుల పారిజాతసత్యనారాయణ, ఎంపీటీసీలు భీమనపల్లి సైదులు, చెర్కు కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు దాడి శ్రీనివాస్‌రెడ్డి, భవనం శ్రీనివాస్‌రెడ్డి, కిష్టాపురం ఉప సర్పంచ్ ఆకుల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏ మంజూరు చేయాలి

నల్లగొండ టౌన్ : ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రవణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 10వ తేదీ పూర్తి కావొస్తున్నా ఉద్యోగులకు ఇంకా వేతనాలు అందలేదని.. ప్రభుత్వం ఉద్యోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.